కొత్తపల్లి సూర్యారావుగారు

(వెనుకటిసంచిక తరువాయి)

ఏడవయంకురము

వివాహమునంతటి సంతోషసమయ మేదియు లేదని స్థూలదృష్టికిఁదోఁచి నలువురు నానందింతురుగాని సూక్ష్మదృష్టిని విచారించిన నంతటి పెద్దవిచార మేసమయములో నెన్నఁడును గలుగదు. మగవానికి నాఁడుదానికి నిదియొక్క పెద్దబెడదవచ్చి మీఁదఁబడుటయే—దశాంతరమునకు మారుటయే—బాల్యాదిదశలుమాఱి గృహస్థాశ్రమమునకుదిగుట మాటలతోనున్నదా! సంసారము మాకు వలదోయితండ్రీ! యని యొక్క నమస్కారముచేసి, శాస్త్రవేత్తలు గృహ్యసూత్రములు రచియించి మనుష్యులకు ద్వంద్వానురాగమునకు దారిచూపిన సర్వజ్ఞులు, మౌనులై యడవులఁబడిపోవుట- దీనికర్థమేమో యాలోచింపవలసినదే. సంసారమును భరించుటయనఁగా మీఁద నుండి పడుచున్న యాకాశమును బ్రహ్మాండమునొక్క పైడిప్పను దలఁపైఁబెట్టుకొని మోయుచుఁ గష్టభారమును లక్ష్యముచేయక- తల కెండపగులుట లేదు. వానచినుకులు మీఁదఁబడుటలే-దని సంతోషించుటవంటిదే కాదా! ఇప్పటికి మనవారిలో నెందఱో వందలు గడించుచున్నవారు కూడ నెట్టి సంసారమును భరింతుము - సంసారమనఁగా భార్యయే పరమార్థము- భర్తయనునామమును మేము భరింపలేము. భార్యనెట్లు భరింతుమని చివరి విధిలేక యున్న జంజాటమునువిడిచి యదార్థపదలు చేయలేక వృద్ధులగుజనకులఁ బోషింపను మాత్రము పనిపూని కుమ్మరపురువులవలె సంచరించుచున్నారు. 'పెండ్లి, నాకుఁబెండ్లి, నాకు భార్యవచ్చును, నాకుమగఁడు, నగలు వచ్చునను నుబలాటము, బిడ్డలఁగందు'మను పెద్దయుత్సాహము- వెఱ్ఱిసంతోషము - ఇందుకనియే, జ్ఞానమునచ్చినపిమ్మట, నొక్కమాఱనుభవించుసంసారులంగాంచి యేమని మతిమాఱునో, యీలోకయాత్ర యెట్లుజరుగునో - మొఱ్ఱో యీసంసారము నాకువలదనిన గ్రామములన్నియు మునిపల్లియలగు నేమో యనియే పెద్దలు, 'మామాటలు చిన్నలువినవలయును. మేము చెప్పినట్లుచేసి మెలఁగవలయును. మాయాజ్ఞలవలన మీకుఁ గష్టమువచ్చినను మీరనుభవింపవలసినదియే' యని బంధించివైచినారు. ఎదిగినకొలఁది స్వాతంత్ర్యమెదిగి 'నాకిది వలదు వీఁడు నాకు వల'దనియందురేని- ఎవ్వని నెవ్వతె యెవ్వతె నెవ్వఁడు నిల్పఁగలుగుదురు? అపుడు కావలులో మున్కరులో-పశుమర్యాదలకు దిగుదురు. సంసారమును భరించుట మాటలా? దానికొఱకే శాస్త్రములు చదువుట, రాజ్యము లేలుట, "తెప్పానాం తేలానాం." పరదేశములు ద్వీపములు గుండెలు చేతఁబట్టుకొని తిరుగుట, సముద్రములు దాఁటుట, యీపాట్లు రెంటికి నీశనముచాలదు. భూమిలోనుండిని క్షేపములు బైలుదేఱినఁగాని యేనుఁగు దాహము చూరునీళ్లతోఁ దీఱదని భూములు పెల్లగించి యొలుకఁబోసి యెత్తికొనుట-సంసారమును భరించుట మాటలా? తాను గోఁచిపెట్టుకొని

తిరిగియైనను భార్యను గుమ్మముదిగి రానీయక, యొరుల కంటఁ బడనీయక, యింటిగుట్టొకరికిఁ జెప్పక, 'నలువురితో నారాయణ'యని సంచరించుట సంతోషముచేతనేనా! మోసముచేసి పెద్ద లిట్టికష్టములలోఁ బడఁద్రోయుచున్నారు. తప్పదు సగముసగములో విడువరాదు. దీనియంతయు చూడవలయునని కుడితికుండలోఁ జేబారలువేయుట యానందముచేతనా! సంసారమును భరించుట మాటలా—రోగములు రొష్టులు, బిడ్డలను పెంచుట, పెద్దవారిం జేయుట—ఈ పెద్దవారిం జేయుటలో నెంత యర్థమైన నిమిడియున్నది. ఓసక్కఫీ! ఏదీ, పెద్దవారిం జేయుట యన నెంతగంభీరాభిప్రాయమున్నదో వర్ణింపుము! వారికిఁ బెండ్లిండ్లు, వారికి సంసారములు, మన వేషమే వారికివేసి యుండినక్కవలె, మనము కష్టపడుచున్నపుడు వీరేల యూరకుండవలయునని యసూయచేతనునలె—గోతిలోఁ బడఁద్రోయుటయే—అబ్బబ్బ! సంసారమును భరించుట యనిన మాటలా? మగఁడు లోకాంతరగతుఁడైన, మగువ నడుము నాయఁగట్టుకొని బిడ్డలం బెంచుట—దైవమా! సోమలేశ్వరా! ఉమారమణా! వలదు వలదు; మగున కీకష్టము వలదు, తెచ్చిపెట్టకుము. మగువ ముందే లోకాంతరము చేరెనా మగవానికష్టము చెప్పఁదరమా! అపుడు మగువాఁడాఁడుదిగా మారవలయును. చేతఁగానిపై యీరెండువిషయములం దలంచుకొంటిమా, వారువారు నలవాటు లేనిపనులలోఁబడు కష్టములం జూచితిమా, స్వామీ! ఒడలు గగుర్పొడుచును. వెంటనే సన్న్యాసాశ్రమము స్వీకరింపవలయుననినంతవైరాగ్యము గడుంగష్టునకైనఁ బుట్టును. పెండ్లియనఁగా నొక్కసారి యాఁడుదానికి—ఆడుకొనుచున్న దానికి—ఈప్రపంచము తలక్రిందుచేసి భూలోకములోని దానినిదీసికొనిపోయి యంతరాళమున వ్రేలాడఁదీయుటయో! ఇంతకంటె వేఱొకటియని యనుభవశాలులును మఱియొక్క దానిం జెప్పఁజాలరని చెప్పవచ్చును. బాలికకుఁ బెండ్లియైనదనిన వెంటనే రెండవ పనిలేదు. 'నాపెనిమిటికి దీర్ఘాయువిమ్ము. నాభర్తకు సుజ్ఞానమొసఁగుము. నానాథునకు నాయందుఁ గరుణపుట్టునట్లు చేయుము. నా పతికి సంసార ప్రభుత్వమిమ్ము. నా పతికి, ధనధాన్యములు ప్రసాదింపుము'—అని దేవులాటతప్ప పెద్దలు వేఱొకదారి చూపింపలేదు. అంతయు నింతికిఁ గాంతునితో నున్నది. పెండ్లియన నొక్కపందెమువంటిది. రామరావణయుద్ధమువంటిది. ఎవ్వరుగెల్తురో, యెవ్వరోడుదురో, పందెముగాదు, యుద్ధముగాదు—గెలుపుచీటులుపైచికొనుటవంటిది. అదృష్టమెవ్వరివంకఁ దిరుగునో, పదికాలములు తిన్నగా నడువవలసినదేకాని—నడుమనే యాంతరము వచ్చునో, శివా! వద్దువద్దు, తండ్రీ! జ్ఞాపకము చేసికొనరాదు. ఆఁడుదానికి మగవానితో నున్నది. మగఁడుతప్ప దానికి వేఱుదైవము, పూజలు, వ్రతములు, యాత్రలు లేవందురు. అర్థమేమి? బాగుగా నాలోచించితిమా— ఆఁడుదానిగతి యధోగతి! ఆఁడుదానికిఁ బెండ్లియైనదనినమాట గుండెలు గుభేలున వ్రక్కలిందు పిడుగుగాని మాటయనవచ్చునా— ఎందుకనో మాడుచున్నాము. ఎన్నికష్టములో పడుచున్నాము. దానిపైఁగల యాశ— ఛీ ఛీ!

"అన్నమైన నదేమిరా, సున్నమైన నదేమిరా" యని వేదాంతి— అన్నము సున్నము నొక్కటియే కనుక యన్నమే తినవగునురోయని—సాఁపునటు. అట్లే సుఖదుఃఖములలోఁబడిన సంసారియును బాడును. దానిలోని రుచియెట్టిదో — దానికున్నరుచి యితరవస్తువులకు లేదు. అజీర్ణముం జేయు తీయనిలడ్డువముందిన బుద్ధి పుట్టునుగాని యారోగ్యమునిచ్చు మిరియములకషాయముఁద్రావ బుద్ధిపుట్టదు. నేను గవినిగానుగాని వేదాంతిని— నేను సంసారమునుగూర్చి వర్ణించిన భ్రమరకీటన్యాయము పట్టునేమో— పట్టకేమి? నేనెందున్న దానను? సంసారమను పెద్దపెడలు పైనతేనె బాలియందుమీఁద వ్రాలినయీగను; పడుచున్నదానను, బాలిలోఁబడి యెక్కలుడడిని కాలుచేతులంటుకొనిపో విలవిలలాడు సమయమేయింక. నే నొక్కరినిభూషించిన దూషించిన 'నీవే ప్రపంచమునుండి యూడిపడితి'వని నలువురు నవ్వుదురు.

ఆభగవంతుఁడు మమ్ము మఱచిపోవలసినదే. కాని, మాలోనేమున్నది? మాపై నాతనికిఁ దలంపు లేకుండ నుండవలయును. అట్లయిన మేము మువ్వురము నొకరీతిగా నుందుము. ఏల తలంపకుండ నుండును? అంతటి తొందర పనివాఁడు జగత్తులో నింకొక్కఁడు లేఁడు. ఆభగవంతుని దేనెటేఁగతోఁ బోల్పవచ్చును. ఇది హీనోపమయందు

రేమోకాని యాతనిపట్లఁ బూర్ణోపమయే - ఒక్కక్షణ మూరకుండఁడు. ఏక కాలమునందే రెండుమూఁడు లక్షల కోట్లు పనులుచేయ మొదలు పెట్టును. పట్టనములోని రాజకిరీటములోనికి మణినిగల్పించుటకును, గుహాలలో నిద్రించు సింహము చెవిలోనో, రోమములమీఁదనో గుయ్యుమనుచుండు మిడినల్లికో చీడపేనునకో కాలుజాఱుగఁ గొట్టి బాధించుటకు, మహాసముద్రములోని తిమింగిల మును గడుపునూడ్చి, తిండిదొరకక చిఱుచేపలై పరుగు లిడుచున్న దానిని వేఁటాడుటకై వేటకాండ్రను సన్నాహము చేయను,—ఒక్కదాని కేమి—యన్నింటికిఁ దానేపో వలయును. ఒక్కచెట్టు నఱికింప, నొక్కచెట్టు (బండింప) నొక్కయూసరాల్ప, నొక్కకొమ్మ చిగిరింప-నొక్కఁడనో పడగొట్టి దారిలోఁ బడిపోయిన బాటసారి ముసలివానికి గంజినీళ్లు పంపుటకై సంసారి నొక్కని లేపను, మునిఁగిపోవుచున్న ద్వీపాంతరములోని యోడలోని బాలు నుద్ధరింప నొక్కపలక నమరించుటను—'ఇంచుఁగల డందు లేఁ'డని సందేహములోఁ బనిలేని యీశ్వరుఁడు—మనలను మఱచి యుండునా! పాపము మఱచియే యున్నాఁడు. మే మెన్నిపాట్లు పడుచున్నామో కనుఁగొనుటలేదు. మా కర్మమున మేమున్నాము. అదిగోఁ గర్మమనఁగా నెవ్వరు? అట్టే దూరము పోవలదు. వేదాంతము ముదురనీయ రాదు.

లక్ష్మీనారాయణునకుఁ దల్లి లేదు; తండ్రి యున్నాఁడు. శంకరదీక్షితునికిఁ దండ్రిలేఁడు, తల్లిగలదు. 'వారములు చేసికొని నాలుగు ముక్కలు నేర్చికొనుటకై నన్నుఁగూడ విడిచిపెట్టి స్థలాంతరవాసముచేసి కష్టార్జితముగా సరస్వతితోపాటు లక్ష్మిని సంపాదించుకొన్నాఁడా మాలక్ష్మీనారాయణమూర్తి'యని యాతండ్రిపడిన సంతోషమునకు మేరలేదు. 'ఎన్నిదినములైనది! నాకిప్పటి కీశ్వరుఁడు సుఖముం గూర్చినాఁడా! నాకొడుకు గృహస్థాశ్రమము స్వీకరించాఁడా! నాకు నట్టింట నాకు నైచి వడ్డించుటకు నాభార్య యీకోడలిని బంపించినదా!' అని, చెప్పనలవిగాని సంతసము. మాయమ్మ, 'కొందఱవలె. నడుగుపెట్టఁగానే పిడుగు పడినదన్నట్లు—అత్తవారియిల్లు చేరఁగానే కుండ చేతికి వచ్చినదని విచారింపలేదు. పోనిమ్మ, సందెగుమ్మ మూడ్చి నీళ్లుచల్లి, నాలుగుముగ్గుకఱ్ఱల వెట్టుటకుఁగాని, దీపము వెలిగించుటకుఁ గాని 'లేక, పాడుపడియున్న సంసారమును నాలక్ష్మి మరలఁ బొత్తుచేయుచున్న'దని యానందించినది. అలవాటు చేత—'అమ్మా నే నుదికికొందునే; నేను మంచినీళ్లు తెచ్చెదను; బిందె యిట్లిమ్మని మామగారు దయచేతనే పల్కెవాఁడు. "వీరాకేలకష్టము నేనుండగా"నని లక్ష్మి పల్కెను. "నేను జేసిచేసి మెలఁకువలు నేర్చియున్నవాఁడను, నీవు క్రొత్తదానవు—నీవుండు"మనువాఁడు—"నేర్చినవారు మీరు నేగని దానికి నాకు నేర్పుఁ"డను నది లక్ష్మి—ఒక్కపని చేయనిచ్చునదికాదు. లక్ష్మీనారాయణునకు వేఱుపనిలేదు. ఏఁడాదికొక్కసారి బళ్లిపాడువెళ్లి వస్తువస్తులు తెచ్చికొనుట, తండ్రిని బువ్వులలోఁ బెట్టి పూజించుట—'ఆహా! శంకరా నాపై దయవచ్చినదా! దయవచ్చినదానికా మరల సంసారములోఁ బడవైచుచున్నాఁడవు.' అని యాముసలాయన రాత్రిందివము లాకోడలిని గొడుకును ముద్దుసేయుటతప్ప వేఱుపనిలేకుండెను. గౌరియత్తగారు—'భగవంతుఁ డెక్కడలేఁడు; దిక్కులేనిదానను; ఒక్కగానొక్క కొడుకు; ఆపూఁటకు గతిలేదు; దేవుఁడా యెట్లురాయని బెంగపెట్టుకొన్నదానను. నాకొడుకుపై దయవచ్చినదా! తిండిలేనివాని కైశ్వర్యమిచ్చి, భార్యనిచ్చి, దీర్ఘాయుష్యమిచ్చి నాకన్నులు చల్లఁబఱచి నన్నుఁ జలికాలఁదన్నినాఁడా! అమ్మతల్లి రామయ్యగారు పెట్టినదీపముగదా యిది. దివ్వెవెట్టి యామహాత్మునకు మ్రొక్కవలయును. 'ఏఱికొనితిను కుఱ్ఱవాఁడే, వీనికేమి మనబిడ్డనేమి, యిచ్చుటయే'యని తలఁచినాఁడా; అగును, పూటికిఁదక్కువగాని కులమునకుఁ దక్కువగాదుగదా; ఏడంతస్తులమేడమీఁద నింకొక్కయంతస్తు లేవఁదీయుట మంచిదా పడిపోవుచున్న ధర్మసత్రము నడికొప్పు బాగుచేయుటమంచిదాయని యాలోచించినాఁడు.' అని పొంగిపోయినది. మాయమ్మ, 'అయ్యో! అత్త కోడలికము కత్తిమీఁది సాముగదా! ఆముసలిదానిచేతిలో నీకసుగందు, బ్రదుకుటయో'ట్లని కొందఱవలెఁ దలంచినదా! మఱి కొందఱవలె 'నా ముసలిముండచచ్చిన మావాండ్రిద్దఱముహాయిగానుందురుగదా'యని దురూహాలు పెట్టుకొన్నదా! లేదు 'బిడ్డయడుగువెట్టినవేళమంచిదైనఁ బదిమందిచుట్టములు వత్తురుపోదురు. అల్లవారిపిల్ల మంచిది; ముట్టాల సు

రఖి యని పొగడుదురు. అత్తయింటఁ గొంతచేయూఁత యున్నది. మగఁడు చిన్నతనమునుండి సుపరిచితుఁడు, బుద్ధిమంతుఁడు- యేమోయేమొకొని తిందుగని విడిచి నామా, కంచము, ముంత, పండు, గుడ్డ, యిచ్చి బ్రదుకుమని పంపితిమి- ఈనిసువుల మట్టెలకమున నా కన్నివైపుల బంధుజాలము పెరుఁగునుగాక! నాకేమికొదవ-'అని కొదవయేదో జ్ఞప్తికిరాఁగాఁ గొంతసేపు కన్నులనీరుపెట్టుకొనుచు ననుదినముగాలక్షేపము చేయుచున్నది. ఆకొదవ భగవంతుఁడు తీర్చవలసినది; తీర్చినాఁడుకాఁడు; మింత లేదు. తీర్చవచ్చును. ఎంతమంది కొదవలు తీరినవికావు.

మాయమ్మకు మాకుటుంబముపై బెంగయెన్నఁడును లేదు. నిర్విచారము, విచారము లేకేమిగాని- ఇది యొక విచారమా-'దేశముగాని దేశములో నున్నది. మనమాట మనమంతి లేదు. బిక్కుబిక్కు మనుచు నున్నది. మగవాఁడు పనిలోనికిఁ బోవును. ఇరుగా పొరుగా; ఏదో భాషయఁట. దీనికేమి తెలియును.' అని తలపోయుట మాయమ్మ కొక్కవిచారమేమో కాని నాకు విచారము లేదు. మేము రైలులోని పనివారమగుటచేఁ గాశీయాత్రకుఁబోవు తెనుఁగువారందఱు మాకుఁ బ్రతినిత్యము కనఁబడుచుందురు. దేశక్షేమము, గ్రామారోగ్యము, బంధువార్తలు తెలియుట కెవ్వరో యొక రెవరొకవారువచ్చుచునే యున్నారు. ఎఱిఁగినవారు రైలులోఁ గనఁబడిన 'రేపు వెళ్లవచ్చును రం'డని దింపి యింటికిఁదీసికొనివత్తురు. మా కొనాఁడు వారితోఁ జిల్లుబొల్లుమనుచుఁ గడచిపోవుచున్నది. లచ్చికిఁ జీరయని, నాన్నకుధానళియని, గౌరికిఁ ఖట్టురవికెలని, అమ్మకు మహాలక్ష్మిపీఁటయనిఁ గౌరియత్తకుఁ దులసికోటయని, లచ్చిమామగారికి నాగరాక్షరముల పుస్తకములని యేవో యెవ్వరిచేతనో మేమిక్కడినుండి పంపుచున్నాము. మాకే బెంగయును లేదు. అందఱ క్షేమవార్తలు తెలియుచున్నవి. కనుక, నిరాలోచనముగ నున్నారము. జీతమంత యెక్కువదిగాదు. అత్తమామలకు మాదానిలోనుండి వారికిఁ జలినీళ్లకు వేఁడినీళ్లు తోడని పంపుచుందుమే కాని వారినిద్దఱ నిక్కడఁ బెట్టుకొనుటకుఁ జాలినంత లేదు. వారికక్కడ, మాకిక్కడఁ గడచుచున్నదని సంతోషము. అంతఅనంటి గుణముగల వారైన నింక రెండుకుటుంబములను బోషింపవచ్చును. గడి పఅకి-కొంకణాలాడునిప్పువలెఁ జూతురు. తామేయున్న వారిలో నక్కడఁ బెద్ద. తేతిక్రిందఁ బదిమందియున్నారు. తీఁగటపాలో నొక్కరు, చీట్లిచ్చుపాఁ రొక్కరు, రాత్రిపనివారు కొందఱు, దీపములు మాపుటకు, దారులు మరలించుటకు, మాటలెత్తుటకు దింపుటకు, తుడుచుటకు నెందఱోయున్నారు అందఱు నొక్కత్రాటిమీఁద నడిపింతురు. 'కక్కుఱితిపని పనికిరాదు. అడిగి పుచ్చుకొనుఁడు. దారులు కొట్టవలదు. మనజీతము మన కమృతము. అన్యాయవిత్తము విషము. మనసు కుదిరియిచ్చినది పుచ్చుకొనుటలోఁ దప్పులేదు. అది మనకరుగును' అని బోధించి వచ్చి నెట్టులుపడియున్న మూటలలోనుండి కోసి యపహరింపకుండ నేతిడబ్బాలకుఁ జిల్లులుపొడవకుండఁ గట్టడచేసిరి. వచ్చెడుభక్తులు, బాటసారులు,'స్టేషను మేష్టరుగారు బహుమంచివారు, ఆక్కడివారును సజ్జను'లని పొగడుచుండిరి. పూగ, కాయ, గింజ, గిట్ట, నూనె, నేయి, పండుఫలము స్టేషనులో నెగుమతికి వచ్చినవి దిగినవి మాపదిమందికి దొరకుచున్నవి. న్యాయముగా మంచిచేసికొని తినినది లోపకార్యమవరాదు. అట్టివారుకానియెడల 'వీరు తీసికొనితినుచు నేయున్నారు; మరల మన మేల?' అని నిరాదరమునసింతురు. పనివాండ్రందఱును మహారాజ్ మహారాజని యడుగులమడుగులొత్తుదురు. ఈ మహారాజమూలమున మనకింతయన్నము దొరకుచున్నదని సంతోషపడువారు. విశేషమేమనఁగా నీ స్టేషను, మాఊరివాల నేకొండలలోనో లేదు. పట్టనము సమీపముననఁగలదు. కావలసినంత బయలుగలదు. నలువురివలెనే మేమును జిన్న యావును సంపాదించికొన్నారము. చిన్నమేష్టరుగారు మాకంటె ముందు వచ్చియున్నవారు, గావున, వారొక్కయావును సంపాదించుకొనియున్నారు. రెంటిని మేఁపలేక 'సంప్రదాయము మంచిది. మాయింటఁబుట్టినది, సొలుకుడిచినది, ప్రక్కకుశేరుపాలిచ్చుదానిబిడ్డ, మీరుపుచ్చుకొనుఁ'డని యేదోరూపము పేరుపెట్టి మాకిచ్చినారు. నెలనెలకుఁ గొంచెము కొంచెముగా దానివెల మాయొద్దనుండి పుచ్చుకొనుపద్ధతిమీఁద గ్రహించినారము. నాకుఁబుట్టినింటఁగూడ దూడలపరిచయము గలదు. ఏకాఁపో బండెఁడు గడ్డిపంపుచున్నాఁడు. పనివాండ్రు చేతిలోనున్నారు. ఆవిని పెయ్యదూడనుబెట్టి

నది. నాకింటియొద్ద నొకరితోఁబనిలేదు. చూడలేమో, నేనేమో పొట్టనిచిట్టని- కట్టుఁగట్టియొద్దఁ జుడిదిపొడి గానుంచుట, యిలువలు నానవేయుట- చెప్పవలదా? ఒక్క పనివానియిల్లాలుదొడ్డది. 'మాయీ, మాయీ' యని నన్నుఁ బిలువవలదు. దానిమాటలు అమ్మాయీ! అమ్మాయి! యని మాయమ్మపిలుపువలె నొక్కప్పుడు తోఁచుచుండును. తల యంటుకొనునప్పుడువచ్చి షీకాయనూఁటి పెట్టును, వీఁపు తోమును. నాతెనుఁగునంట యామె కెంతో యిష్టము. ఏదో వంతెనలు కట్టునప్పుడు చిన్నతనములోఁ దండ్రితో మన దేశమువచ్చినదఁట- ఆపరిచయముచేత, నన్నామె మూర గాయపాటలతో నన్ననుసరించుమంచును. ఆమె సాహాస మే నాకు హిందీ నేర్చుకొనుటకుఁబనికివచ్చినది. దొడ్డితుడుచు వానికొడుకే మా యావును బగలంతయు నెక్కడనో మర లించి మేఁపుకొనివచ్చును. ఎప్పుడైననేను, తోటే యనిపిలిచిన, 'హా! మాయి!' యని యంతలునువచ్చి పడుదురు. చిన్న మేష్టరుగారు బాబూలు; వారి భాష యిది కాదు. కాని దేశభాష హిందీ వారికివచ్చును. ఓహో యనుచుఁ, గాసలు కార్యము లప్పుడే కాని వారియాఁడువారితో గట్టిపరిచయము నాకుదొరక లేదు. నీళ్ల గొట్టముకడకు వారురారు. ఏపనివాఁడో తెచ్చియిచ్చును. మఱియు వారియింటికి మాయిల్లు కొంచెముదూరము.

కొన్నినాళ్లకుఁగాని తెచ్చుకొనవలసినవి బియ్యమును వస్త్రములునే. తక్కినవన్నియు యథేష్టముగా నింటికి వచ్చుచుండు నంతటి సమయము వచ్చినది. ఢిల్లి సంద్రములను రప్పింపవలయునని తలంచిరి. రైలులోఁ బెద్ద యధికారుల మూలమున వారిని స్వేఛను రప్పించుటకు ధారాళముగా మార్గపత్రము సంపాదింప గట్టి యత్నము చేసిరి. ఇంతలో సామ్యము చెప్పినట్లు - ఒక్కరోజునకు బీద వానిపైఁ గరుణవచ్చి యేనుఁగు నిచ్చినాఁడఁట- ఏనుఁగును బుచ్చుకొన్నామన్న సంతోషమేనా - పెంచుటలోఁ గష్టముమాట! ఈరీతిగానే జీతమెక్కువ చేసి నామని యధికారులు కలకత్తాకు మమ్ము మార్చినారు. చీపురుపుడకగొడ్డనుండి యిక్కడి కిక్కడనేవిడిచి, యాపద్ధతి మీఁదనే యావును దూడ నొకరికిచ్చివేసి- జీతమెచ్చునకు నగరములో రట్టింపు సెలవులకు - సమానమానసములతో నధికారులయాజ్ఞ ననుసరించి కలకత్తా చేరితిమి. ఇంక వారిని దీసికొనివచ్చుట యెక్కడ? గొంచెము గొప్ప? చేతిలోనిది కూడ నెగిరిపోవు నవస్థవచ్చినది.

"మహారాజ్ కో బదిలీ హోగయా హై" అని యక్కడి పనివాండ్రే కాదు- చుట్టుప్రక్కల వర్తకులు మొదలగువారు మేము రైలుదేఱునాఁడు రైలుకడకు మమ్మంపవచ్చిరి. ఇదియును జెప్పవలసినదే. రైలుకదలు నప్పుడొక్క వర్తకుఁడు ప్రీతిపూర్వకముగాఁ దాంబూల మిచ్చినాఁడు. అది మేమొకటి రెండు నెలలు తడవు కొనకుండఁ గలకత్తాలో వక్కఁగా స్థిరపడుటకుపకరించినది. ఆతావు విడుచుట మాకును గష్టమే యనిపించినది. అత్తవారింటికిఁ గ్రొత్తకోడండ్రు వెళ్లునట్లు దిగులుదిగులు మనుచునే వెళ్లినారము. అక్కడమాత్రము మనుష్యులు లేరా? ఇదియేనా మనము పుట్టినప్పటినుండి నివసించుచున్నది? నేను గాక మనుపు రెండు తావులకు మాఱిరి. ఎక్కడనున్నను నోరుమంచిది కావలయును. మనదేశస్థులు కలకత్తాలోను బెక్కురుందియున్నారు. కాశికి వెళ్లువారంతలు నక్కడనే దిగుదురు. కాశికాదేవి సామీప్యము చేరితిమి.

ఎనిమిదవయంకురము

విద్యయందాశలేనివారును, గతించిన వ్యర్థకాలమునకై పశ్చాత్తాపపడనివారును, పెరుగడింపవలయునను నభిప్రాయము లేనివారును, ధనమున్నదే చాలును-మఱి యక్కఱలేదనువారును, బీదయైనను సంసారభారమునకు విసిగినవారును సాధారణముగా నుండరు. పెండ్లికాకమును పే- 'యింటనున్న విద్య యబ్బినది కాదు. అది నాలోపము గాదు. నాయదృష్టదేవత చేసిన లోపము. ఊరిలో వేఱు విద్య నేర్చుకొనుట కుపపత్తులు లేవు. అది నావంటి బాలురు చేసిన సంఘదుష్కృతము. ఇంటఁ గావలసినంత ధనమున్న నేపట్టన మోచేరి యేదో చూడవచ్చును. అది మాకుటుంబము చేసికొనిన దౌర్భాగ్యము. వారితో వారితోఁ జేసిన కృషి యింటిలోఁ దండ్రితోనే చేయక పోయితినే- దృష్టి వేఱుగానుండుటచేఁ దండ్రిమాటలు చెవి కెక్క లేదు. "కలవిద్యలెన్నియైనను గలవిద్యకు సాటి రావు-' దానివలన ధనము రానీ మాననీ, యది యలవడినది గాదు. ఇహపరసాధనములైన వేదాదివిద్యలు నాకబ్బెనా! పొట్టకూటి విద్యయైన నొక్కటి యలవడినదా!

ఈకాలపువారు, నీయుప్పరివారు, పెద్దవారును నాను సహా వాసముచేయునదియు నొక విస్మయమేనా! దానిపై నేదో కొంత యభిమానము గలిగినది. 'చదువునకిద్దఱు జపమున కొక్కఁడు' నని సామెత—తండ్రిగారు చెప్పఁబోవు చదువునకు సహాధ్యాయుఁడు లేకపోయెను. ఎవ్వరో కొలతల యుద్యోగితోఁ దిరిగిన నాకేమి ప్రయోజనము? నా కాతఁడేదైన పనిచెప్పునా, యీతఁడు స్వాతంత్ర్యము గలవాఁడుకాఁడు. వెనుక నొక్క చిన్నవానికి సమయ మట్లు వచ్చినది. దొరతోఁ జెప్పినాఁడు. రెండుకోసుల మారము తిరిగి మార్గములోఁ జెట్లు చేమలు, తూములు, మార్గము మెఱక పల్లములు సదునుచేయించుట—ప్రయాణికుల సౌకర్యమునకు రాదారిని గాపాడుటయే యాతని పనియై యుండెను. ఆపనిలోనుండి యీబాలుఁడు చేసిన గర్వపు దుశ్చేష్టలు – పనియిప్పించిన వానిమర్యాద కూడఁ దగ్గుటకు హేతువైనది. తనకు పదిరూపాయల జీతమా! దనక్రింద నొక్క మూఁడురూపాయల జీతపు సేవకుఁడా! తన కుద్యోగ మిప్పించిన పెద్దయుద్యోగి యామడల క్రొలఁది కాలినడకను దారులు మాముటకు వచ్చుచుండ నీచిన్నవాఁడు తట్టుగుఱ్ఱమునెక్కి వచ్చుటయూ – సేవకుని జూచిరమ్మని తానింటఁ గూర్చుండుట – నలువురచేఁ బనిచేయించి యాఱ్వురను బద్దుప్రాయుట—ఇట్లుండ "విషవృక్షోపి సంవర్ధ్య స్వయంఛేత్తుమసాంప్రతం" మ్మని యుండుటచేఁ గొంచెము సంశయించి వినకున్న మిన్న కుండి, పాపమాయన చిన్నవానినేమియు ననకుండఁగనే లోపములు తానే సవరించుకొనుమఁ గాపాడి కొన్నిదినములలో వేఱొకతావునకు మార్పఁబడిన తరువాత వచ్చిన యొక్కరు విషయముఁ దెలిసికొని యధికారమును నూపెఁ దీయించిరి. "అధికారాంతమునందుఁ జూడవలదా యాయయ్య సౌభాగ్యముల్" మూన్నాళ్ల యుద్యోగమునకై రెపరెపలాడి గజాంతైశ్వర్యము బ్బిన ట్లుబ్బినవాఁడన్యని యాచించుటకు మఱియొక పని చేయుటకు నభిమానము కల్గెను. సులము పెద్దది; బలము తక్కువ? చెప్పవలసిన దేమి? ఆ బాలుఁడు చివరకు— 'అప్పాలుతెన్నులు— మప్పుమూఁడు తెన్నులు' చేసినాఁడు. ఇట్టియూళ్ల లోని యుద్యోగమొక యుద్యోగమా? ఇంతకంటెఁ బసులవెంటఁ దిరుగుట? చదుద్యోగము' అనిమనస్సులోనుండెను. 'పరులకుఁ జెప్పక—లోలోన—తలిదండ్రులను విడుచుటయెట్లు? తానొంటిగా నింకొకస్థలమున నివసించుటయెట్లు?' అని చింతమనస్సులో మెండుకొనినది. సింహాచలయాత్రనుండి యింటికిరాకుండఁగనే మార్గములోఁ బెండ్లిప్రస్థాపించినది. ఏదియేనొక్క యుపాయము మాచికొని— తండ్రినడుగకుండఁ బెండ్లమున కొక్క యధికగుడ్డకొనుటకు రెండణాలైన స్వతంత్రముగా సంపాదింపలేకుండ నింటఁబడియుండుట యొక్క పౌరుషమాయని పుట్టినదికాఁబోలును దిగులుపడుచు నేకాంతవిచారమునకు మొదలుపెట్టిరి.

పత్యకాలపు తల్లిదండ్రులు గ్రహింపలేదు. అప్పుడప్పుడువచ్చు "ఓవరుసీరు" గారు కనిపెట్టినారు. 'అబ్బాయి! ఏలనీవు మునుపటివలె లేవు? విచారముగాఁ గనఁబడుచున్నాఁడవు, కారణము నాతోఁ జెప్పు'మని యడిగిరి. 'నాకీయూరఁ దోఁచుటలేదు. ఏపట్టనమునకైనఁ బోయి యొక్క కాలక్షేపవిద్య నేర్చికొనవలయుననియున్నది. మావారొడఁబడరు. నేను స్వతంత్రింపఁజాలను. నాకేదియు నుపాయము తోఁచుటలేదు' అని యోవరుసీరుగారితో విన్నవించిరి. 'దీనికింత యోజనయేమిటికి? మాబంధువులే, ఘనాఢ్యులు, వ్యాపారులు, నొక్క పట్టనములోనున్నారు. వీఁడు మిక్కిలి విద్యాధికులు— నీకేవిధవిద్య యందభిరుచికలదో దానిని నేర్పించెదరు. నేను నిన్ను వారికొప్పగించెదను పోయెదవా' యనిరి. కృతజ్ఞతగలవాఁడై 'పోయెద'ననిరి. 'వారి పేర నుత్తరము చెప్పెదను నీవే వ్రాయుము.' అని కాగితము గలము నిచ్చి 'అన్నగారికి—నమస్కారములు, ఈయుత్తరము తెచ్చిన బాలుఁడు నాకిష్టుఁడు. పల్లెటూరిలోనుండి కాలము వ్యర్థము చేయుచున్నదని పశ్చాత్తాపపడుచున్నాఁడు. వీనికేదేని మీరొక యుపాధి కల్పించెదరా నాకుఁగల్పించినట్లు సంతోషించెదను' అని వ్రాసి తాము చేవ్రాలుచేసి యాపట్టనమునకుదారి యానవాళ్లుఁ జెప్పి తండ్రిగారియనుమతియిప్పించి పంపించిరి. మాఁడఁగనే యామహారాజు—వీరు తెచ్చినయుత్తరముపుచ్చుకొని చదివికొని— 'దీనిని వ్రాసినవారెవ్వరు? నీ పేరెవ్వరు, గ్రామమేది' యని కుశలప్రశ్న చేసి తమగిడ్డంగిలో సాయంకాలమువఱకుఁ గూర్చుండుమని— రాత్రియింటికిఁ దనతోఁ దీసికొనివెళ్లి, తమప్రక్కనే భోజనము పెట్టించి, మేడమీఁ

దికిఁ దీసికొనిపోయి కూర్చుండి- 'మరల నీవే యుత్తరము మీయోవరుసీరుగారికి వ్రాయు' మని—'మీరుపంపిన చిన్నవాఁడు వచ్చినాఁడు. ఇతని కభిమానముగలవిద్య యేదియో యది మేము నేర్పించుటకు మాకనేక సౌకర్యములున్నవి. మేమనేకవ్యాపారములలో నుందుము. దేనిలోనైన బ్రవేశపెట్టవచ్చునుగాని, ఈతనితల్లిదండ్రులసమ్మతిని మీరు కనుఁగొని రెండుమూఁడుకట్టుబట్టలిచ్చిపంపవలయును' అని వ్రాయించి చేవ్రాలుచేసి, 'అబ్బాయి! నాకుఁగొంచెము స్వస్థతగానున్నది. ఉదయమున నేను లేచువఱకుఁ గాచుకొనియుండవలదు. నీవు మరల నన్నుఁ జూడనక్కఱ లేదు. ఒడ్డెమంగలి నీకుఁ గ్రింద మండపముమీఁదఁ బక్కవేయును పండుకొని తెల్లవాఱఁగనే లేచి వెళ్లిరమ్ము. భయము లేదు. నేను నీకుఁ గావలసిన విద్య నేర్పించెదను.' అని ధైర్యము చెప్పిపంపించిరి.

తలిదండ్రులకేమి, మన ఓవరుసీరుగారికేమి యీ ప్రత్యుత్తరము సంపూర్ణానందము గలిగించినది. మంచిదినముఁ జూచి తండ్రిగారే దిగవిడిచి వచ్చినారు. నడుమ నడుమఁ గార్యాంతరములమీఁద వచ్చుచుండు ఓవరుసీరుగారు క్షేమసమాచారములు కనుఁగొనుచుండిరి. 'ఏవిద్య వచ్చినను రాకపోయినను వ్యవహారమునకు మిక్కిలి ముఖ్యముగాఁ జెప్పినదానిని జక్కఁగా వ్రాయువాఁడు లేక చిక్కుపడుచున్నారము. మీరు మాకుఁ జక్కని కుఱ్ఱవాని నప్పగించినారు'- అని వారోవరుసీరుగారిని స్తుతించుచుండువారు. పుత్రసంతానము లేని యీమహాత్ముఁడు వీరిని బెంచుకొనుకొడుకువలెఁ బెంచి విద్యాబుద్ధులు నేర్పెను. ఒక్కప్రొద్దైన నొంటిగా విస్తరివేయలేదఁట. ఆతల్లి కన్నతల్లికంటె మంచిదఁట - తమతోపాటు సమస్తసదుపాయములు చేసిరఁట- ఏమహాత్ముఁడవరుసహో మొదట- వీరు నిలువఁబడినచో నందఱు నేక గర్భజనితులవలెలోకులు భావించునంతటి సమానవయస్కులగు నా బాలికాసంఘమును వీరియం దన్నగారియందువలె భక్తివిశ్వాసములు గల్గియుండెనఁట- ఆసత్కర్ముఁడు, సజ్జనుఁడు, సర్వజ్ఞుఁడు, దేవభాష, రాజభాష, మాతృభాష చక్కఁగా నెఱిఁగినవాఁడు. లక్ష్మీసరస్వతులు వైరముమాని వారి యింట మెలఁగుచుండిరి. మహాబుద్ధిశాలి, బ్రహ్మవేత్త, తపోనిధి, నేర్పరి, తీర్పరి, ఎక్కడఁ జనుమన్నను, గుఱ్ఱపుబండిలోఁ గుమారునివలెఁ గూర్చుండఁబెట్టుకొని పురమంతట సంచరించువారఁట. కొన్నినెలలు గడచినవి. శీతోష్ణాదిస్థితులు కొంత వికటించినవి. జ్వరమువచ్చినది. మొగమునఁ బొదములఁ గొంచెము మెఱుఁగు చూపెను. ఇంట సమస్తమును గలవు. స్వయముగా నావహరాజాను వైద్యుఁడు. మేనమామ ప్రసిద్ధవైద్యుఁడు. మందులిచ్చుచునే యుండఁగా గీళ్లనొప్పులు వచ్చినవి- టెంగజ్వరమో యని బండిచేసి తలితండ్రులయొద్దకిఁ బంపివైచిరి. ఏఱు దీసిపోయినట్లు నాలుగురోజులలో నన్ని జబ్బులును బోయినవి. మఱిపది నాళ్లుండి క్రమ్మఱఁ బట్టనముం జేరెను. నాఁడునాఁటికి వ్యాపారములోని విషయములు బోధపడఁజొచ్చెను. ఒక్కొక్కప్పుడు దొరలు రాక 'అబ్బాయి! నీవు వెళ్లి యీపని యట్లు లీపని యిట్లు చేయించి తలుపులు జాగ్రత్తగా మూసికొని, యెంతమంది పనివాండ్రు పనిచేసిరో, యెవ్వరేపనిచేసిరో వ్రాసికొని ర'మ్మని స్వతంత్రుని జేసి పంపుతారు. చెప్పినట్లు చేసికొని వచ్చుటయే కాక మఱునాఁటికిఁ గావలసిన యేర్పాటులుకూడఁ జేసి వచ్చుచుండుటచే వారిమనస్సునకెక్కెను. కొంచెమో గొప్పయో రాజవిద్య యలవడినది. వ్యవహారకాండము కొంత నేర్చిరి. పదిమందికిఁ బరిచయము చేసిరి. ఇట్లు మూఁడేండ్లయిన జరుగకుండఁగనే నలువదియేండ్లయిన వయసు రాకుండఁగనే యీమహారాజు స్వర్గస్థులైరి. ముసలితల్లిని, తపస్వినియైన యిల్లాలిని యజ్ఞానమగు సంతానమును విడిచి చనినారు- ఈయనయం దంతకంటె నెక్కుడు ప్రేమకనఁబఱుచుట కవకాశ మెక్కడిది. వృద్ధమాత మాత్రము వదలెనా! 'అబ్బాయి! అబ్బాయి!' యనికూడఁ ద్రిప్పుకొనుచుఁ గొన్నాళ్లు వ్యవహారములలోఁ ద్రిప్పుకొనియెం గాని యీమె కేకపుత్రప్రేమ భూలోకమునం దసహ్యము పుట్టించెను.

తద్వ్రతను బంక్రాంతమైన యీ వ్యాపారములలోఁ గొన్ని సంవత్సరములు పనియెఱిఁగియున్నవారగుటచే నుండవలసివచ్చెను. ఇతరులయొద్దఁ బనిచేయుచున్నను భోజనము, బసవారియింటనుండి మార్చుటకు వలనుగాకపోయెను. మరల నొకజబ్బువచ్చినది. అది, యెంతమంది వైద్యులకును దొరకలేదు - ఎఱిఁగియున్న వైద్య

లందఱు శ్రమపడిరి. ఒక్కనాఁడు వ్యాపారశాలలలో నుండి యొక సేవకునిచేత 'నేఁడు నే నింటికి రాఁజాలను. రాత్రి యిందే పండుకొందును. ఉదయమున లేచి వత్తు'నని వార్త యంపినాఁడు. అదివిని యాతల్లి పడినదుఃఖము చెప్పనలవికాదు. 'ఈమాట చెప్పినంతనే వారు దుఃఖించుచున్నా'రని సేవకుఁడు వచ్చి చెప్పెను. 'అయ్యో'యని వానిబుజమున నానుకొని మెల్లగ నడచి యింటికి వచ్చిరి. అప్పటి కాయమ్మ 'బిడ్డల నింటిలో నుండుఁ' డని లాంతరువెలిగించుకొని సేవకునితోఁగూడ బయలుదేరి వైద్యునింటికిఁ జని 'బాబూ! పిల్లవానికేమియును గుణము కనఁబడుటలేదు. నేఁడింటికి రానని చెప్పి పంపినాఁ'డని విచారించుచుఁ జెప్పెను. 'అమ్మాయి, నీకిమమకార మెందుకు- వానికిక్కడఁ గుదురదు, పదిదినములకుఁ గొన్ని పాట్లుము లిచ్చెదను పల్లిపండ్రుల దగ్గఱకుఁ బంపివేయుము. నీవీబెడద నెత్తిఁ బెట్టుకొనకు'మని నిష్ఠురముగా వెల్లడించిరి. ఆతల్లి యేమియు ననఁజాలక చీకటిలోఁ గన్నీరు విడుచుచు నింటికివచ్చినది. అప్పటికే వచ్చి- దొడ్డిలో వైటమంచముమీఁద మూల్గుచుఁ బండుకొనిరి. మాదినంతనే దుఃఖమును మరుపఱచుకొని 'అబ్బాయి! యెట్లున్నది. పోనీ, యక్కడఁ బండుకొనిన మంచినీరే కావలయునో యేమి కావలయునో యెవ్వరక్కడనని కలఁతపడితిని. బాబునడిగివచ్చితిని, రేపు పొట్లములిచ్చెదనని చెప్పె'నని యెూదార్యమాటలాడెను. ఆరాత్రి యాఁకలిలేక యన్నము తినలేదు. 'అయ్యో యిఁక నేమిదారి? తిండిపడిపోయినదే' యని యామె గట్టిగాఁ బలికెను. 'ఈయనకుఁ దోఁప లేదు. నన్నింటికిఁ బంపివేయుఁడు. రాముని నాతోనిచ్చిన నేను బోఁగలను. ఒక్కమాసము నే నందుంటికు నాదురును- మరల వచ్చెద'ననిరి.

'అక్కడ మందెవ్వరిచ్చెదరు. పల్లెటూరు-'

'ఇక్కడఁ బట్టణములో మందిచ్చిన గుణముకనఁబడినదా.'

'ఇతఁడుగాక నింకొక వైద్యుఁడున్నాఁడేక్కడ-'

'ఎవ్వరైననిం తే. నాకు ధైర్యము లేదు, మీకుఁగష్టము గలుగకుండవలయునని చూచుచున్నాఁడను.'

'మాకేమికష్టము, మాకేమియుఁ గష్టము లేదు. నీకేమియుభయము లేదు.'

'నాకొక్కటియేభయము. మీకుఁ గష్టముకలిగించుచున్నాఁడనని-'

'నీవేమియు సందేహింపవలదు. నీకేమికావలసినను రాముఁడున్నాఁడు. వరసమ్మయున్నది. వారు నీకు సమస్తోపచారములు చేసెదరు. మేమేమియుఁ గష్టపడము.'

'నేనిక్కడ నుండఁజాలను- కొన్ని దినములు నన్నింటికిఁ బంపివేయుఁడు.

'నామాటవినుము; నీవక్కడకువెళ్లిన గష్టపడియెదవు.'

'నన్నింటికిఁ బంపి వేయుఁడు - మీకన్నివిధముల నావలనఁ గష్టము వచ్చును.

'మాచుకొందము గాని రాత్రియైనది. పండుకొనుము. నీవు సందేహింపవలదు.'

'నీకేమైనఁ గావలసి నన్నడుగ నిష్టము లేనియెడల చెల్లెలున్నది. దాని నడుగుము, నీవలన మాకేమియుఁ గష్టము లేదు.'

'నాకేమియు వలదు. నన్నూరికిఁ బంపుఁడు.'

ఈమాటల కాతల్లి మాఱుమాట యాడఁజాలక కన్నీటితో లోనికిఁ బోయి కూఁతుతో 'ఇదియే మీ యింటికిఁ బోదునా యని పట్టుపట్టినాఁడు. నీవేమైనఁ జెప్పి మరలింపఁగలవా' యని ప్రసంగించెను. ఆముద్దుచెల్లెలువచ్చి తనమంచము నామంచము ప్రక్కనే వేయించుకొన్నది. నడుమ నడుమఁ జేరు పెట్టి - బిలుచుచు, 'ఏమి మూలుగుచున్నాఁడవు. మంచినీరు కావలయునా?' యని యడుగుచుండెను.

ఆబిడ్డతో నీయన-

'నాకేమియు వలదు. నన్నూరికిఁ బంపి వేయరాదా!'

'అదిగో నీవామాటఁ బట్టుకొని వదలకుండుటచేతనే యమ్మ వసారాలో విచారించుచున్నది.'

'అట్లయిన నన్నికఁ దప్పక పంపివేయవలసినదే. నాకదేభయము-నావలన మీకుఁ గష్టము.'

'మాకేమి కష్టము! సుఖముగా నున్నపు డుండనిచ్చి జబ్బుగా నున్నపుడు పంపివేయుదుమా?'

'నన్ను గుఱించి మీరు మిక్కిలి శ్రమపడియు న్నారు. ఔషధములు పనిచేయనపు డిక్కడనే యేల-'

'రేపు మఱియొక మందు మార్పవచ్చును. అది కొన్నినాళ్లు మాడరాదా.'

'నాకు ధైర్యము లేదు. నన్నూరికిఁ బంపివేయుఁడు.'

'అగును, నిజమే, మే మెంత జాగ్రత్తగాఁ జూచినను మేము మేమే. మీతల్లిదండ్రు లిక్కడ లేరు.' (అని యొడంబడుటకై నిష్ఠురముగాఁ), 'మాయమ్మ నీకమ్మ యగునా? మేము నీచెల్లెం డ్రముగుదుమా? నీ వనారోగ్యముగా నున్నవాఁడవు. నిన్నింతకంటె నిష్ఠురము లాడఁజాలను.'

ఈమాటతో నీయనకుఁ గొంతమనసు మరలి- 'అమ్మాయి! మీ రేమనుకొన్నను మంచిదియే.'

'మేమేమియు ననుకొనుటయు లేదు-నీవే యన్నియు ననుకొనుచున్నాఁడవు.'

'నా కీజబ్బు కుదురదను నధైర్యముతో నట్లూరికిఁ బోఁదలచి యంటినిగాని వేఱుకాదు.'

'నీవు పల్లెటూరిలో మందు ద్రవ్యములు దొరకక యెట్లగుదువో యని మే మిట్లనుచున్నాము.'

అని యా చెల్లెలు లేచివచ్చి మంచముపైఁ బట్టెమీఁదఁ గూర్చుండి - చేయిపట్టుకొని- 'నీవమ్మను మఱింత దుఃఖ పెట్టకుము. రాత్రియన్నము తిన్నఁగాఁ దినలేదు. నే నిక్కడ నుండను, నన్నూరికిఁ బంపివేయుమని పెంకిపట్టు పట్టితివా ఱేపుజొత్తిగా నన్నమే తినదు.'

'అయ్యో, చూచినావుగదా నావలన మీకువచ్చు గష్టములు!'

'మా కేమియుఁ గష్టములు లేవు. పోనీకాని, మమ్ము గష్టపెట్టవలదు. నీకీయూర నుండుట కిష్టము లేకున్న-అక్కయ్యదగ్గఱకు వెళ్లెదవా? అక్కడబావ వైద్యుఁడు. మనమందఱము నెఱిఁగిన రావుగారున్నారు. మంచివైద్యులు- అమృతహస్తమువారిది. రామునిగూడఁ బంపెదను. నీవక్కడకు వెళ్లెదవా.'

'ఈమాట వినఁగనే, మేమిదియన్నియుఁ గలవలెఁ జెప్పుకొనవలసిన యోగముండఁబట్టి కాఁబోలును- 'అక్కడ వెళ్లెద' నని సమ్మతించిరి. చెల్లెలొక్క యుఱకలోఁ బోయి - అమ్మా! 'అక్కయ్యగారి యింటికి వెళ్లెదనని యొప్పుకొన్నాఁడే' యన్నది. ఆతల్లి బిరాలున లేచివచ్చి

'అబ్బాయి! అబ్బాయి! నీకుభయము లేదు. మీయూరు వెళ్లనంటివా నీవు బ్రదికినవాఁడవే-'

ఈయన, 'మాయూరు వెళ్లెదనని నే ననలేదు. మాయూరు మాయిల్లు నాకింతకంటె వేఱు లేదు. మిమ్ము గష్టపెట్టుట నాకిష్టము లేక-'

'ఇంక నీవు బ్రదికినాఁడవనియే నాకు ధైర్యము. ఱేపు ప్రొద్దుననే రైలులో నెక్కించెదము పోయిరా' మ్మని దగ్గఱఁ గూర్చుండి సమాధానపఱిచి యాతల్లి తాము సమాధానపడి--కొంతసేపుండి నిద్రించెను.

'దైవమా! ఈయమ్మకంటె నీచెల్లెలికంటెనా క్రొత్తచుట్టఱికము? అక్కయ్యనుబట్టి బావవైద్యమున కని- అక్కయ్య భర్తవారియింట రోగముతోఁ బోయి యెట్లుందు'నని యేమైన సందేహపడియెనా? లేదు. ఈ యిల్లే నా యిల్లని భావించెను. ఉదయమున రైలెక్కించినారు. ఆగుంటూరిలో దిగి వారియింటికి సుటముఁ జేరినైచిరి. అక్కయ్య, బావ చూచినారు; ఏమియిట్లున్నావని యడిగినారు. వృత్తాంతము సమస్తముం జెప్పి, 'యింటికిఁ బంపివేయుమంటిని, నన్నిక్కడికిఁ బంపినా' రని చెప్పిరి. బావగారు, వదినెగారును 'మంచిపని జరిగినది. అక్కడకుఁ బోయిన నీపాటికి-వేం చేసియుందువు. (అబ్బ! యీమాట యిప్పుడనుచున్నను భయముగానున్నది.) చాల సంతోషముగానున్న'దని యాదరించి కొన్నినాళ్లు వైద్యముచేయించి పూర్ణారోగ్యుని గావించిరి: ఏనాఁడెవ్వరికెవ్వరెంత యుపకరించిరో యెఱుఁగరాదుగద! తల్లిదండ్రులీ సమయములో నేమిచేసినారు.? ఏమియుఁ జేయలేదు. సంగతి తెలిసివచ్చినవారిని 'సరిసరి, మీరందఱువచ్చి మఱింత బెంగ కలిగించెదరు. మీరుండనక్కఱ లేదు. మేమున్నాము; పొమ్మ'ని బావగారు వదినెగారును వచ్చినవారి నెల్లఁ బంపివైచిరి. వారియాదరణము దైవకటాక్షమువలె వ్యాధిని వారణముగావించినది.

"ఘనముగఁ బ్రాణముర క్షించిన యుపకారికి నప్రియంబు సేయుదు" రనని సెత్తురె యెవ్వరైన - ఆనాఁడు మొదలు వదినెగారు వారియూరికి వచ్చినపుడెల్ల- ఏమయ్యా 'యెన్నిపీపాలకందికట్టు త్రాగినావు. రైలు సంచి చిలుకకొట్టునఁ దగిలించినావా'యని హాస్యముచేయుచుండెడువారు.